గోడ వీడ్కోలు

రిటైర్మెంట్ ప్రకటించిన గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్



ఢిల్లీ: భారత హాకీ జట్టుతో 18 ఏండ్లుగా కొనసాగుతున్న దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు చెప్పనున్నాడు. గోల్ పోస్ట్ వద్ద ప్రత్యర్థులు యత్నించిన గోల్స్‌ను పెట్టని గోడలా అడ్డుకుని జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన అతడు.. పారిస్ ఒలింపిక్స్ ముగిశాక ఆట నుంచి రిటైర్ కానున్నట్టు సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపాడు. 36 ఏండ్ల ఈ మాజీ సారథి 2006 నుంచి భారత జట్టుతో కొనసాగుతూ ఇప్పటిదాకా 328 మ్యాచ్‌లు ఆడాడు. 'పారిస్ ఒలింపిక్స్‌తో నా సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికేందుకు సిద్ధమయ్యా. ఈ అద్భుత ప్రయాణంలో నాకు అండగా నిలిచిన కుటుంబానికి, సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, హాకీ ఇండియాకు కృతజ్ఞతలు. పారిస్‌లో భారత్‌కు పతకం తెచ్చేందుకు మా అత్యుత్తమ ప్రదర్శనను చేస్తాం. పతకం రంగు మార్చడానికి ప్రయత్నిస్తాం' అని తెలిపాడు.

18 ఏండ్ల సుదీర్ఘ కెరీర్..

2004లోనే భారత జూనియర్ హాకీ జట్టులోకి వచ్చిన శ్రీజేష్.. 2006లో కొలంబో వేదికగా జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్ సందర్భంగా సీనియర్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు. అయితే కెరీర్ తొలి నాళ్లలో జట్టులోకి వస్తూ పోతూ సాగిన శ్రీజేష్ ప్రయాణం.. 2011 తర్వాత కొలిక్కివచ్చింది. అప్పట్నుంచి అతడు భారత జట్టులో రెగ్యులర్ గోల్‌కీపర్ అయ్యాడు. టీమ్‌ఇండియా సాధించిన పలు చారిత్రాత్మక విజయాలలో సభ్యుడిగా ఉన్న శ్రీజేష్.. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులోనూ సభ్యుడు. 41 ఏండ్ల తర్వాత హాకీలో కాంస్యం నెగ్గిన మ్యాచ్‌లో శ్రీజేష్.. జర్మనీ ఆటగాళ్లు కొట్టిన బంతులకు అడ్డుగోడగా నిలబడి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. కాగా శ్రీజేష్ రిటైర్మెంట్ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్‌లో అతడి కోసం ఆడి పతకం సాధిస్తామని కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ ఆశాభావం వ్యక్తం చేశాడు.

PARIS 2024

3 రోజుల్లో

ప్రిక్వార్టర్స్‌కు నాగల్

కిట్జ్‌బుహెల్: భారత టాప్ ర్యాంక్ టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ ఏటీపీ 250 కిట్జ్‌బుహెల్ (ఆస్ట్రియా) ఓపెన్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరాడు. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో నాగల్ 6-4, 1-6, 7-6 (7/3)తో లుకాస్ క్లెయిన్(స్లోవేకియా)ను ఓడించాడు. తొలి సెట్‌లో నెగ్గినా తర్వాత వెనుకబడ్డ నాగల్.. నిర్ణయాత్మక మూడో సెట్‌లో పుంజుకుని ప్రిక్వార్టర్స్‌లో ప్రపంచ 45వ ర్యాంక్ స్పెయిన్ ఆటగాడు పెడ్రో మార్టిన్‌తో తలపడనున్నాడు.

పారిస్‌కు మరో 49 మంది..

పారిస్: ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు అంచెలంచెలుగా పారిస్‌కు వెళ్తున్న భారత బృందంలో మరో 49 మంది క్రీడాకారులు సోమవారం ఫ్రాన్స్ రాజధానికి చేరుకున్నారు. టేబుల్ టెన్నిస్, టెన్నిస్, ఆర్చరీ, భారత హాకీ, షూటింగ్ జట్లకు చెందిన 39 మంది క్రీడాకారులు ఒలింపిక్ గ్రామానికి చేరారు. ఇప్పటికే బాక్సింగ్, అథ్లెటిక్స్ నుంచి పలువురు తొలి అంచెలోనే పారిస్‌కు వెళ్లిన విషయం విదితమే.

గురి కుదిరేనా?

ఆర్చరీలో బోణీ కొట్టని భారత్ • ఆరుగురు ఆర్చర్లపై భారీ ఆశలు

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

ద్రోణాచార్యుడి మట్టి ప్రతిమనే గురువుగా మలుచుకుని తన విలువిద్య విన్యాసాలతో పాండవులను ఆశ్చర్యచకితుల్ని చేసిన ఏకలవ్యుడి ఘనమైన వారసత్వం.. పక్షి కంటిని గురి పెట్టి కొట్టిన అర్జునుడి వీరత్వం ఉన్న విలువిద్య (ఆర్చరీ)లో మన దేశానికి ఒలింపిక్స్‌లో ఇంత వరకూ ఒక్కటంటే ఒక్క పతకం రాలేదు. 1988 సియోల్ ఒలింపిక్స్ నుంచి ఈ ఆటలో పాల్గొంటున్న మన విలుకాళ్లు ఇప్పటిదాకా పతక బోణీ కొట్టలేదు. విశ్వక్రీడావేదికపై పతకాల వేటలో తడబడుతున్న మన ఆర్చర్లు 'పారిస్'లో అయినా తమ అమ్ములపొదిలో దాగి ఉన్న విల్లంబులతో పతక కరువును పారదోలుతారా?

ఒలింపిక్స్‌లో ఇంతవరకూ ఆర్చరీలో పతక బోణీ కొట్టని భారత్.. పారిస్ ఒలింపిక్స్‌లో అయినా ఆ లోటును పూడ్చుకోవాలని భావిస్తోంది. గడిచిన రెండు మూడేండ్లుగా అంతర్జాతీయ స్థాయిలో మన ఆర్చర్ల నిలకడైన ప్రదర్శనతో ఈసారి భారత్‌కు పతకాలు తెచ్చే ఈవెంట్స్‌లో ఆర్చరీ కూడా చేరింది. పారిస్‌లో ఐదు ఈవెంట్లలో ఆరుగురు ఆర్చర్లతో బరిలోకి దిగుతున్న భారత్.. గతంతో పోల్చితే ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తోంది. అనుభవజ్ఞులు, యువకులతో కూడిన విలుకాళ్ల బృందం ఈసారి పతకాలతోనే తిరిగిరావాలనే పట్టుదలతో ఉంది. 40 ఏండ్ల వయసులో మూడోసారి ఒలింపిక్స్‌లో పాల్గొననున్న తరుణ్‌దీప్ రాయ్, మాజీ ప్రపంచ నంబర్‌వన్, నాలుగో ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న దీపికా కుమారి, రెండోసారి విశ్వక్రీడల్లోకి దిగుతున్న ప్రవీణ్ జాదవ్ అనుభవం.. తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర, 18 ఏండ్ల అమ్మాయి భజన్ కౌర్, ప్రపంచ 40వ ర్యాంకర్ అంకితా భక్త్ వంటి తొలిసారి ఒలింపిక్స్ ఆడనున్న వారితో ఆర్చరీ బృందం సమతూకంగా ఉంది. వ్యక్తిగత ర్యాంకింగ్స్‌లో పైన పేర్కొన్న ఆటగాళ్లు ఇటీవలి కాలంలో అత్యుత్తమ ర్యాంకులను నమోదు చేసి జోరుమీదున్నారు. గత కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న ధీరజ్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. 'ప్రస్తుతం ఆర్చర్ల ప్రదర్శనను బట్టి చూస్తే భారత్‌కు పురుషుల వ్యక్తిగత, టీమ్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో పతకాలు కచ్చితంగా వస్తాయి' అని 'సాయ్' ఆశాభావంతో ఉంది. ఒలింపిక్స్‌లో ఆర్చరీ పోటీలు జూలై 25న మొదలై ఆగస్టు 4 దాకా జరుగుతాయి.

కొరియన్ సవాలు..

రికర్వ్ ఈవెంట్‌లో పురుషుల, మహిళల వ్యక్తిగత విభాగాలతో పాటు టీమ్ ఈవెంట్స్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న మన ఆర్చర్లు.. కొద్దిరోజుల క్రితమే ముగిసిన ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్ 1, 2, 3లో అంచనాలకు మించి రాణించి పారిస్ బెర్తులను దక్కించుకోవడం శుభసూచకం. ప్రతి ఒలింపిక్స్‌లో పతకాలు కొల్లగొట్టే కొరియా ఆటగాళ్ల నుంచి ప్రధాన పోటీ ఎదురయ్యే ఈ క్రీడలో మనవాళ్లు ఆ సవాళ్లను ఎలా దాటతారనేది ఆసక్తికరం. ప్రపంచకప్, ఇతర టోర్నీలలో రాణిస్తున్నా అసలైన సవాలు ఎదురయ్యే ఒలింపిక్స్‌లో 'ఆ ఆరుగురు' ఏ మేరకు సత్తా చాటుతారనేది చూడాలి.

భారీ ఖర్చు..

పారిస్ ఒలింపిక్స్‌లో మన ఆర్చర్లు పతకం నెగ్గాలనే లక్ష్యంతో కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ 'టాప్స్' స్కీమ్ కింద పలువురు ఆర్చర్లపై 2021 నుంచి ఇప్పటిదాకా రూ. 39.18 కోట్లను ఖర్చు చేసింది. ఆటగాళ్లకు 41 నేషనల్ క్యాంపులు, 24 ఫారెన్ ఎక్స్‌పోజర్ ట్రిప్‌లు, ఆటగాళ్ల వ్యక్తిగత శిక్షణ, వారికి సదుపాయాలు తదితరాలపై వీటిని ఖర్చు చేసింది.

సిరీస్‌లు ప్లేయర్ల ఎంపిక కాదు

• **స్పష్టం చేసిన గంభీర్, అగార్కర్**

న్యూఢిల్లీ: ఏ సిరీస్‌లో ఆడాలి..ఎందులో ఆడవద్దు అనేది ప్లేయర్ల ఎంపిక కాదని బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగర్కార్, నూతన కోచ్ గౌతం గంభీర్ స్పష్టం చేశారు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌కు అనుగుణంగా ప్లేయర్ల రొటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం సోమవారం శ్రీలంకకు బయల్దేరే ముందు గంభీర్, అగర్కార్ పలు అంశాలపై మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌పై వీరిద్దరు స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. 'బ్యాటర్లకు, బౌలర్లకు పని ఒత్తిడి విషయంలోచాలా క్రిస్టల్ క్లియర్‌గా ఉన్నాం. ఇంతకుముందు చెప్పినట్లు ఉదాహరణగా బుమ్రాపై ఒక రకంగా ఒత్తిడి ఉంటే..మంచి ఫామ్‌లో ఉన్న బ్యాటర్లు అన్ని మ్యాచ్‌లు ఆడితే దానిని పరిగణనలోకి తీసుకుంటాం. అంతేగానీ వరుస సిరీస్‌లు ఆడినంత మాత్రాన ప్లేయర్లకు విశ్రాంతినిచ్చే ఆలోచన చెయ్యం. ఏదైనా 2027 వన్డే ప్రపంచకప్ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు ఉంటాయి' అని అన్నారు. రోహిత్‌శర్మ వారసునిగా టీ20 కెప్టెన్‌గా హార్దిక్‌పాండ్యా నియమించకపోవడంపై అగార్కర్ స్పందిస్తూ ఫిట్‌నెస్‌తో పాటు డ్రెస్సింగ్ రూమ్‌లో ప్లేయర్ల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చామని అన్నారు. కోహ్లీతో సంబంధాలు ఎలా కొనసాగుతాయన్న దానికి గంభీర్..మీ టీఆర్‌పీలు పెంచుకోవడానికి మరేం లేదంటూ తనదైన శైలిలో సమాధానమిచ్చాడు.

బింద్రాకు ఒలింపిక్ ఆర్డర్

న్యూఢిల్లీ: భారత క్రీడా దిగ్గజం అభినవ్ బింద్రాకు సమున్నత గౌరవం దక్కింది. ఒలింపిక్ మూమెంట్‌కు చేసిన సేవలకు గాను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐవోసీ) బింద్రాకు ప్రతిష్ఠాత్మక ఒలింపిక్ ఆర్డర్‌ను ప్రకటించింది. ఆగస్టు 10వ తేదీన పారిస్‌లో జరిగే 142వ ఐవోసీ సెషన్‌లో జరిగే అవార్డు కార్యక్రమంలో బింద్రాకు అందించనున్నారు. ఒలింపిక్స్‌లో క్రీడల అభివృద్ధికి తాము ఎంచుకున్న ఆటల ద్వారా లేదా సాధించిన ఘనతల ద్వారా ఈ అవార్డుకు ఎంపిక చేయనున్నారు.

స్కాట్లాండ్ బౌలర్ ప్రపంచ రికార్డు

• **అరంగేట్ర మ్యాచ్‌లో ఏడు వికెట్లు**

దుండె: స్కాట్లాండ్ యువ పేసర్ చార్లి కాసెల్ ఆడుతున్న తొలి మ్యాచ్‌లోనే ఏడు వికెట్లు (7/21) పడగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఐసీసీ పురుషుల క్రికెట్ వరల్డ్ కప్ లీగ్ 2 లో భాగంగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 5.4 ఓవర్లు వేసిన కాసెల్ ఒక ఓవర్ మెయిడిన్ చేయడమే గాక 21 పరుగులే ఇచ్చి 7 వికెట్లు తీశాడు. తాను వేసిన తొలి ఓవర్లోనే మూడు వికెట్లు పడగొట్టాడు. తద్వారా తొమ్మిదేండ్ల క్రితం బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో సౌతాఫ్రికా పేసర్ కగిసో రబాడ నెలకొల్పిన రికార్డు (6/16) రికార్డు కనుమరుగైంది. కాసెల్ దెబ్బకు ఒమన్ 21.4 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌట్ అయింది. లక్ష్యాన్ని స్కాట్లాండ్ 17.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంతర్జాతీయ వన్డే క్రికెట్ చరిత్రలో ఇలాంటి ఫీట్ తొలిసారి నమోదు కావడం విశేషం.

భారత స్క్వాష్ జట్ల ఓటమి

హోస్టన్: ప్రపంచ జూనియర్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల, మహిళల జట్ల పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. ఆదివారం జరిగిన క్వార్టర్స్ పోరులో శౌర్య బవ, అరిహంత్, యువరాజ్‌తో కూడిన భారత పురుషుల జట్టు 1-2తో దక్షిణ కొరియా చేతిలో ఓడింది. మహిళల జట్టు (షమీనా రియాజ్, అన్హంత్, నిరుపమ)ను 1-2తో మలేషియాను ఓడించి సెమీస్‌కు చేరింది.

యాక్షన్ మోడ్‌లో బాలయ్య

హ్యాట్రిక్ విజయాల తర్వాత బాలకృష్ణ చేస్తున్న సినిమా 'ఎన్టీకే 109'. కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రగ్య జైస్వాల్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఏపీ ఎన్నికల కారణంగా కొన్ని నెలల పాటు వాయిదా పడ్డ ఈ సినిమా షూటింగ్, మళ్లీ మొదలైంది. శరవేగంతో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నారు దర్శకుడు బాబీ. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ రాజస్థాన్‌లో జరుగుతున్నది. ఇక్కడ బాలయ్యపై భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌ని చిత్రీకరిస్తున్నట్టు తెలుస్తున్నది. బాలయ్య, బాబీడియోల్ గ్యాంగ్ నడుమ సాగే ఈ యాక్షన్ ఎపిసోడ్స్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని ఫిల్మ్ వర్గాల సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు అభిమానుల్ని బాగా కట్టుకున్నాయి. ఈ సినిమాకు 'వీరమాస్' అనే టైటిల్ మొదట్లో అనుకున్నారు. కానీ అభిమానుల భిన్నాభిప్రాయాలు రావడంతో ఆ టైటిల్‌ని మార్చే యోచనలో చిత్రబృందం ఉన్నట్టు తెలుస్తున్నది. థమన్ స్వరాలందిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీపై క్లారిటీ రావాల్సివుంది.

ఓ వైపు ఆనందం.. మరోవైపు భయం

మిస్ ఇండియా మీనాక్షి చౌదరి స్పీడ్ చూస్తుంటే.. వచ్చే ఏడాదికి టాప్ హీరోయిన్ అయి కూర్చునేలా ఉంది. ఆమె లైనప్ అలా ఉంది మరి. 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుపెట్టిన ఈ అందాల భామ.. రెండో సినిమా 'హిట్ 2'తో హిట్ అందుకున్నది. అక్కడి నుంచి అవకాశాలు ఈ ముద్దుగుమ్మకి క్యూ కట్టాయి. తమిళ అగ్రహీరో విజయ్‌కు జోడీగా తాను నటించిన పాన్‌ఇండియా సినిమా 'GOAT' సెప్టెంబర్ 5న విడుదల కానుంది. దుల్కర్ సల్మాన్‌కు జోడీగా నటించిన 'లక్కీభాస్కర్' సెప్టెంబర్ 7న విడుదల కానుంది. విశ్వక్‌సేన్‌తో జతకట్టిన 'మెకానిక్ రాకీ' అక్టోబర్ 31న రానుంది. వెంకటేశ్, అనిల్ రావిపూడిల సినిమాలో కూడా మీనాక్షి చౌదరే కథానాయిక. వీటితోపాటు వరుణ్‌తేజ్ 'మట్కా'. ఈ లైనప్ గురించి మీనాక్షిని అడిగితే 'అంతా గాడ్ గ్రేస్. పైగా చేస్తున్న వన్నీ పాన్ ఇండియా సినిమాలే. ఓ వైపు ఆనందంగా.. మరోవైపు భయంగా ఉంది. అటు యంగ్‌స్టర్స్‌తోనూ, ఇటు సీనియర్ హీరోలతోనూ చేసే ఛాన్స్ బహుశా నాకే దక్కిందేమో..' అంటూ ఆనందం వెలిబుచ్చింది మీనాక్షి చౌదరి.

వేట్టయాన్‌కి వేళ కాలేదట

కేరళలోని ఓ పెళ్లికి హాజరై తిరిగి చెన్నై బయలుదేరిన సూపర్‌స్టార్ రజనీకాంత్‌ని తిరువనంతపురం విమానాశ్రయంలో మీడియా చుట్టుముట్టింది. ఫ్లైట్‌కి సమయం ఉండటంతో మీడియా ప్రశ్నలకు తీరిగ్గా సమాధానాలిచ్చారు తలైవా. కమల్‌హాసన్ 'భారతీయుడు2' సినిమా గురించి ప్రశ్నించగా, 'బాగుంది.. నాకైతే నచ్చింది..' అంటూ సింపుల్‌గా నవ్వుతూ సమాధానమిచ్చారు రజనీ. తన సినిమాల గురించి మాట్లాడుతూ - ' 'వేట్టయాన్' రిలీజ్ డేట్ ఖరారు కాలేదు. ప్రస్తుతమైతే డబ్బింగ్ పనులు జరుగుతున్నాయి. ఇక 'కూలీ' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది.' అని తెలిపారు. ఇదిలావుంటే.. 'వేట్టయాన్' సినిమాకు సంబంధించి తన వర్క్ మొత్తం పూర్తయిందనీ, సినిమాను దసరాకు విడుదల చేసే అవకాశం ఉందని ఇటీవల రజనీ చెప్పారు. ఇప్పుడు మాత్రం డేట్ ఖరారు కాలేదని ఆయనే చెప్పారు. మొన్నామధ్య సూర్య 'కంగువ' నిర్మాత ఓ ఇంటర్వ్యూలో రజనీకాంత్ 'వేట్టయాన్' వాయిదా పడిందని, అందుకే 'కంగువ'ను దసరాకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పుడు ఎయిర్‌పోర్ట్‌లో రజనీ చెప్పిన సమాధానం, 'కంగువ' నిర్మాత చెప్పినదానికి బలాన్నిచ్చినట్టయ్యింది.

చిత్రం

డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ

రామ్ పోతినేని కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల థియేట్రికల్ రైట్స్‌ని ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ సొంతం చేసుకున్నది. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నామని ప్రైమ్‌షో సంస్థ నిర్మాతలు నిరంజన్ రెడ్డి, చైతన్యరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు విడుదల చేసిన పాటలు, ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని, ఈ సినిమాలో ఓల్డ్‌సిటీ శంకర్‌గా రామ్ పాత్ర మాస్ అంశాలతో ఆకట్టుకుంటుందని, ప్రేక్షకులకు డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారంటీ అని చిత్ర బృందం పేర్కొంది. కావ్య థాపర్, అలీ, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యామ్ కె. నాయుడు, జియాని జియాన్నెలి, సంగీతం: మణిశర్మ, నిర్మాతలు: పూరి జగన్నాథ్, ఛార్మికౌర్, రచన-దర్శకత్వం: పూరి జగన్నాథ్.

ఆలోచనల సంఘర్షణకు తెరరూపం

'ఒక వ్యక్తి తప్పు చేసినా ఒప్పు చేసినా అతని ఆలోచనలే కారణం. మనం చేసే పనిముందు ఆలోచనల సంఘర్షణ జరుగుతుంది. వాటిని విజువలైజ్ చేసి ఈ సినిమాలో చూపిస్తున్నాం. ఇదొక వినూత్న ప్రయత్నం' అని దర్శక,నిర్మాత వెంకటసత్య అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం ఆపరేషన్ రావణ్'. రక్షిత్ అట్లూరి, సంకీర్తన విపిన్ జంటగా నటించిన ఈ చిత్రంలో రాధిక శరత్‌కుమార్ కీలకపాత్రధారి. ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో రూపొందిన ఈ న్యూఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా సోమవారం దర్శక,నిర్మాత వెంకటసత్య విలేకరులతో ముచ్చటించారు. 'నేటి తరం యువత ఎప్పుడు ఎలా రియాక్టవుతారో చెప్పలేని పరిస్థితి. ఒక మనిషి సైకోగా ఎందుకు మారతాడు? అనేది ఇందులో చూపించాం. రామాయణం ఇన్‌స్పిరేషన్‌గా రూపొందిన థ్రిల్లర్ ఇది.' అని చెప్పారు వెంకటసత్య. హీరో రక్షిత్ తన కుమారుడు అవ్వడంచేత, పోరాట సన్నివేశాలు తీసే టైమ్‌లో కాస్త టెన్షన్ ఫీలయ్యానని ఆయన అన్నారు. రక్షిత్ చాలా బాగా నటించాడని, కష్టమైన సమాసాలతో కూడిన పద్యాన్ని కూడా సింగిల్ టేక్‌లో ఓకే చేశాడని, అలాగే శరవణ వాసుదేవన్ సంగీతం సినిమాకు హైలైట్ అని వెంకటసత్య పేర్కొన్నారు.

పోలీస్ పవర్‌ని తెలిపే సినిమా

'మగధీర'లో ప్రతినాయకుడిగా సత్తాచాటి, నటుడిగా తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న దేవ్‌గిల్ హీరోగా రూపొందుతోన్న చిత్రం 'అహో! విక్రమార్క'. పేట త్రికోటి దర్శకుడు. ఈ చిత్రం ఆగస్ట్ 30న పాన్‌ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇందులో దేవ్‌గిల్ పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా నటిస్తున్నట్టు ఈ పోస్టర్ చెబుతున్నది. పోలీసుల ఆకింతభావాన్నీ, గొప్పతనాన్నీ ఈ సినిమాలో చూపించనున్నామని, నటుడిగా తనలోని కొత్త కోణాన్ని ప్రేక్షకులు చూస్తారని దేవ్‌గిల్ చెప్పారు.

ఆస్ట్రేలియాలో చారిటీ క్రికెట్

ది రాయల్ చిల్డ్రన్స్ హాస్పిటల్ మెల్బోర్న్ కోసం తెలుగు సినీ సెలబ్రిటీస్ (టీసీఏ) చారిటీ క్రికెట్ టోర్నీ నిర్వహించబోతున్నారు. ఈ సెలబ్రిటీ క్రికెట్ టోర్నీ సీజన్-2కి సంబంధించిన పోస్టర్‌ను ఇటీవల ఆవిష్కరించారు. నవంబర్ 15, 16 తేదీల్లో ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో ఈ క్రికెట్ మ్యాచ్‌లను నిర్వహిస్తామని టీసీఏ ఫౌండర్ సాయికృష్ణ తెలిపారు. ఓ సదాశయం కోసం ఈ క్రికెట్ టోర్నీని నిర్వహించడం అభినందనీయమని హీరో శ్రీకాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోలు తరుణ్, సుశాంత్, అశ్విన్‌బాబు, సంగీత దర్శకుడు తమన్ తదితరులు పాల్గొన్నారు.

'స్కూల్ లైఫ్' మొదలైంది

పులివెందుల మహేష్ స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న 'స్కూల్ లైఫ్' చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నైనీషా, రాహుల్ త్రిశూల్ నిర్మాతలు. సావిత్రి కృష్ణ కథానాయిక. ముహూర్తపు సన్నివేశానికి యువ హీరో కిరణ్ అబ్బవరం క్లాప్‌నిచ్చారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా ఈ సినిమా రూపొందిస్తున్నామని పులివెందుల మహేష్ తెలిపారు. సెప్టెంబర్‌లోగా సింగిల్ షెడ్యూల్‌లో చిత్రాన్ని పూర్తి చేస్తామని నిర్మాతలు పేర్కొన్నారు. సుమన్, ఆమని తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.